సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 23 । జూన్ । 2024



గిరిజనాభివృద్ధికి కృషి..
గిరిజనుల అభివృద్ధికి పీఓగా తన వంతు కృషి చేశానని వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన ప్రతీక్‌జైన్ వెల్లడించారు.
8లో



పోలీసులకు సేవా పతకాలు
ప్రభుత్వం శనివారం పోలీసులకు కఠిన, సేవా, శౌర్య పతకాలు ప్రకటించగా, జిల్లాలో 66 మంది ఎంపికయ్యారు.
8లో

గరిష్టం / కనిష్టం
31° / 26°

వాతావరణం
జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వాతావరణం చల్లగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జానకి రాముడికి ప్రత్యేక పూజలు



అభిషేకం అనంతరం శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న జానకి రాముడికి శనివారం జ్యేష్టాభిషేకం వైభవంగా జరిపారు. జ్యేష్ఠ మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఏరువాక పౌర్ణమి రోజున ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కనుల పండువగా వేడుక నిర్వహించారు. తొలుత బేడా మండపంలో ఏర్పాటు చేసిన 81 కలశాలలో సమస్త నదీ జలాలను ఆవాహనం చేశారు. అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. ఆ తదుపరి 81 కలశాలతో ఆవాహనం చేసిన నదీ జలాలతో జ్యేష్టాభిషేకం నిర్వహించారు. తొలకరి జల్లుల సమయంలో దేశంలో వరుణ దేవుడి కరుణ కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా పడాలని, తద్వారా దేశం పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుతూ పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం స్వామివారికి హారతి సమర్పించారు. కాగా అభిషేకం సందర్భంగా శనివారం రద్దు చేసిన నిత్యకల్యాణం ఆదివారం యథావిధిగా జరగనుంది. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయిలో ఖమ్మం మార్కెట్

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మిర్చి మార్కెట్ నిర్మాణం జరగనుంది. సీజన్‌లో లక్ష కంటే ఎక్కువ మిర్చి బస్తాలు వచ్చినప్పుడు స్థలం సరిపోవడం లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌లో నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈమేరకు రూ.148కోట్ల అంచనాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను శనివారం పరిశీలించిన మార్పులు, చేర్పులపై సూచనలు చేశారు.

గైర్హాజరీ గోల..



సింగరేణి ప్రధాన కార్యాలయం

- సింగరేణిలో 39 వేల మందికిపైగా ఉద్యోగులు
- విధులకు ఎగనామం పెడుతున్న 1,204 మంది కార్మికులు
- భూగర్భ గనుల్లో విధులకు కార్మికుల విముఖత
- నియామకాల్లో జాగ్రత్తలు తీసుకోని యాజమాన్యం

2023 ఏడాదిలో కనీసం వంద మస్టర్లు కూడా చేయని కార్మికుల వివరాలు..

ఏరియా	తరచుగా గైర్హాజరవుతున్న ఉద్యోగుల సంఖ్య
కొత్తగూడెం	80
ఇల్లెందు	12
మణుగూరు	39
రామగుండం-1	138
రామగుండం-2	71
రామగుండం-3	18
అడ్రియాల	84
బెల్లంపల్లి	05
మందమర్రి	199
భూపాలపల్లి	162
శ్రీరాంపూర్	395
కార్పొరేట్	01
మొత్తం	1,204

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థలో పలువురు కార్మికులు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. అయితే కార్మికులందరూ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం కూడా విఫలమవుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల పరిధిలో 12 ఏరియాల్లో విస్తరించి ఉంది. సంస్థ పరిధిలో 39 వేల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా 22 భూగర్భ, 18 ఓపెన్‌కాస్ట్ గనులతోపాటు కార్పొరేట్, వర్క్‌షాప్, సివిల్ తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు. కార్మికుల్లో చాలా మంది తరచుగా విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు సంస్థ పరంగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సంస్థ ఏడాదిలో దాదాపు 365 రోజులూ బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం పండగలు, వారాంతపు సెలవు రోజుల్లో పని చేసే వారికి డబుల్ మస్టర్లు ఇస్తుంది. ఇలాంటివి వద్దనుకుంటే కనీసం మూడు వందల రోజులు పని దినాలుగా ఉంటాయి. అయితే ఏడాదంతా కలిపినా కనీసం వంద రోజులు కూడా పని చేయడానికి ఇష్టపడని కార్మికుల సంఖ్య సింగరేణిలో 3 శాతంగా ఉంది.

భూగర్భ గనుల్లోనే..

సర్ఫేస్, కార్పొరేట్ ఏరియాలతోపాటు ఓపెన్‌కాస్ట్, అండర్ గ్రౌండ్‌మైన్లు అన్నింటా విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉంటోంది. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికుల సంఖ్య అత్యధికంగా ఉంటోంది. ఇప్పటికే సంస్థ పరిధిలో ఉన్న భూగర్భ గనులన్నీ తీవ్ర నష్టాల్లో ఉన్నాయి. ఓపెన్ కాస్ట్ మైన్లతో పోల్చితే భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కార్మికుల గైర్హాజరుతో ఈ నష్టాలు మరింతగా పెరుగుతున్నాయి. తరచుగా విధులకు హాజరుకాని కార్మికులకు చేత పని చేయించేందుకు నూతన విధానాలు, పద్ధతులేవి సంస్థలో అమలు కావడం లేదు. తాతాల కాలం నాటి కౌన్సెలింగ్‌తోనే సరిపెడుతున్నారు.

పొంతనలేక..

కారుణ్య నియామకాల ద్వారా వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించిన తర్వాత పన్నెండు వేల మంది సంస్థలో నియమితులయ్యారు. ఇలా సంస్థలో చేరుతున్న వారికి పాత పద్ధతిలోనే భూగర్భ గనుల్లో పనులు కేటయించడం వల్ల గైర్హాజరు శాతం ఎక్కువగా ఉంటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మేరకు సంస్థ అవసరాలు కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో చేరే ఉద్యోగుల విషయంలో వారి విద్యార్హతలు ఆసక్తులకు మధ్య పొంతన ఉండేలా సరికొత్త విధానం అమల్లోకి తీసుకురావాలనే డిమాండ్ వస్తోంది. దీంతోపాటు భూగర్భ గనుల్లో మ్యాన్‌రైడింగ్ యంత్రాలను ఏర్పాటు చేయడంలోనూ జాప్యాన్ని నివారించాల్సిన అవసరం ఉంది.

కారణాలు ఇలా..

గడిచిన ఎనిమిదేళ్లుగా నోటిఫికేషన్ల కంటే మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ ద్వారానే ఎక్కువ మంది సింగరేణిలో ఉద్యోగులుగా చేరారు. ఇలా ఉద్యోగాలు పొందుతున్న వారిలో 90 శాతం మంది భూగర్భ గనుల్లోనే పని చేయాల్సి ఉంటుంది. వీరు కనీసం 190 మస్టర్లు చేసిన తర్వాతే సర్ఫేస్‌కు అర్హత పొందుతారు లేదా ఇంటర్నల్ పరీక్షలు రాయడం ద్వారా పదోన్నతి పొందే అవకాశం ఉంది. అప్పటివరకు భూగర్భ గనుల్లో కఠినమైన ప్రదేశాల్లో పనులు చేయాల్సి ఉంటుంది. అయితే గతంలో పోల్చితే ఇప్పుడు మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఉద్యోగాలు పొందుతున్న వారిలో దాదాపు అందరూ కనీసం విద్యావంతులే ఉంటున్నారు. ఐటీఐ వంటి వృత్తివిద్యతోపాటు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసిన వారు కారుణ్య నియామకాల ద్వారా సంస్థలో ఉద్యోగం పొందుతున్నారు. తమ విద్యార్హతలకు గనిలో చేసే పనికి పొంతన లేకపోవడంతో ఎక్కువ మంది విధులకు హాజరయ్యేందుకు మొగ్గు చూపడం లేదు.

జాతీయస్థాయికి మూడు ప్రాజెక్టులు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

కొత్తగూడెంఅర్బన్: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలలో జిల్లాకు సంబంధించిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు తెలి పారు. ఈమేరకు శనివారం వివరాలు వెల్లడించా రు. ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టుల వివరాల ను ఈ నెల 21న విడుదల చేశారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 25 ప్రాజెక్టులు ఎంపిక కాగా, వీటిలో మూడు ప్రాజెక్టులు జిల్లా నుంచి ఎంపికై , అగ్రస్థానంలో నిలిచాయన్నారు. భద్రాచలంలోని త్రివేణి పాఠశాల విద్యార్థిని పి.భవ్యశ్రీ రూపొందించిన సీడ్ సోయింగ్ మిషన్, రేగుబల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మచ్చా మాధవి రూపొందించిన ఇకో ఫ్రండ్లీ ఆర్గానిక్ బనానా ఫైబర్ ప్రాజెక్టు, అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.హర్షిత రూపొందించిన స్పిన్ సపోర్టర్ జాకెట్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు ప్రాజెక్ట్‌ల గైడ్ టీచర్లు నాగలక్ష్మి, శ్రీదేవి, బి.రామచంద్రు, చింతసాగర్‌లను డీఈఓ, జిల్లా గణాంకాల విభాగం ఇన్‌చార్జ్ శ్రీనివాస్, పరీక్షల విభాగం ఇన్‌చార్జ్ ఎస్.మాధవరావు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

'కరుణ' వీడలేక..



తెలుగు ఉపాధ్యాయురాలు కరుణకు వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య ఆత్మీయత, అనుబంధం ఉన్న సందర్భాలు ఎంతో అరుదుగా కనిపిస్తున్నాయి. అలాంటి సందర్భమే చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆవిష్కృతమైంది. జెడ్పీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు బి.కరుణ పదేళ్లుగా పనిచేస్తున్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించడంతోపాటు విద్యార్థుల ఉన్నతికి, నడవడికకు కృషి చేశారు. దీంతో పిల్లలకు ఆమెతో ఆత్మీయత ఏర్పడింది. ఉద్యోగోన్నతిపై బూర్గంపాడుకు బదిలీకాగా, శనివారం ఆమె పాఠశాల వదిలి వెళ్తుండగా విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. మేడమ్‌ను వీడలేక విద్యార్థులు, విద్యార్థులను వీడలేక మేడమ్ కన్నీటి పర్యంతమయ్యారు. తోటి ఉపాధ్యాయులు కూడా భావోద్వేగానికి గురయ్యారు. చిత్తశుద్ధితో పనిచేసి పిల్లల హృదయాలను గెలుచుకున్న ఆమెను అందరూ అభినందించాల్సిందే.



కన్నీరు పెట్టుకుంటున్న కరుణ, సహచర ఉపాధ్యాయులు

– చంద్రుగొండ

సెలవులో రామాలయ ఈఓ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి వ్యక్తిగత కారణాలతో ఈ నెల 31 వరకు సెలవులో వెళ్లారు. అప్పటివరకు ఇన్‌చార్జి ఈఓగా దేవాదాయ శాఖ వరంగల్ డీసీగా పని చేస్తున్న శ్రీకాంతరావుకు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రోటోకాల్ సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌చార్జిని నియమించినట్లు తెలుస్తోంది.

సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 340 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పాలిసెట్–24 ర్యాంకులు పొందిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్ చేసుకున్నారు. వీరందరూ సీట్ల కేటాయింపు కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ తెలిపారు.

భక్తులకు రక్షణ కల్పించాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారని, వారికి రక్షణ కల్పించడం మన బాధ్యతని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం గోదావరిలో సరదాగా ఈతకు వెళ్లి ఐదుగురు బాలురు అనుకోకుండా గోదావరిలో మునిగిపోవడంతో అక్కడే ఉన్న జాలర్లు నలుగురిని కాపాడగా ఓ బాలుడు మృతి చెందాడు. బాలురు మునిగిన ప్రదేశాలను ఆయన పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు సమాచారం అందించేందుకు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. గోదావరి పరిసరాల్లో తిరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్ రావు, సీఐ సంజీవరావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

బూడిద కమ్మేస్తోంది..

- కేటీపీఎస్ యాష్‌పాండ్‌లో పేరుకుపోతున్న నిల్వలు
- గాలికి లేచి గ్రామాలను అలుముకుంటున్న కాలుష్యం
- నియంత్రణ చర్యలు చేపట్టని జెన్‌కో, కేటీపీఎస్ అధికారులు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ యాష్‌పాండ్‌లో బూడిద నిల్వలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. బలమైన గాలులు వీచినప్పుడు బూడిద లేచి గ్రామాలను కమ్మేస్తోంది. ఇటీవల కొద్ది రోజులుగా వస్తున్న ఈదురుగాలులకు బూడిద లేచి పరిసర గ్రామాలను కమ్మేస్తోంది. దీంతో స్థానిక ప్రజలతోపాటు పశుపక్ష్యాదులు అనారోగ్యంబారిన పడాల్సి వస్తోంది.

గ్రామాలను కమ్మేస్తున్న కాలుష్యం

యాష్‌పాండ్‌లో బూడిద నిల్వలు పేరుకుపోయి బలమైన గాలులకు సూరారం, సోములగూడెం, పునుకుల, పుల్లాయిగూడెం, కరకవాగు, పాండురంగాపురం తదితర గ్రామాల్లో బూడిద కాలుష్యం వెదజల్లుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. జెన్‌కో, కేటీపీఎస్ అధికారులు ఎప్పటికప్పుడు బూడిద తరలించకపోవడంతో బూడిద నిల్వలు పేరుకుపోయి, ఈ పరిస్థితి తలెత్తుతోంది. గతంలో సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలకు బూడిద ఉచితంగా ఇచ్చారు. కొంతకాలంపాటు టన్ను బూడిద రూ.75 చొప్పున విక్రయించారు. ప్రస్తుతం ధర రూ.300కు పెంచడంతో, కొనుగోళ్లు తగ్గి బూడిద నిల్వలు పేరుకుపోతున్నాయి. కాగా బూడిద విక్రయించుకునే అవకాశం గిరిజన సొసైటీలకు అప్పగించాలని గిరిజనులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జెన్‌కో అధికారులు ఐటీడీఏ ద్వారా గిరిజన సొసైటీలకు అప్పగించే యోచనలో ఉన్నట్లు సమాచారం. కాగా సూరారంలో కాలుష్య నియంత్రణశాఖ అధికారులు గతంలో కాలుష్య నియంత్రణ యంత్రాన్ని ఏర్పాటు చేసినా, సక్రమంగా పనిచేయడంలేదు.



కేటీపీఎస్ యాష్‌పాండ్‌లో పేరుకుపోయిన బూడిద



గ్రామాన్ని కమ్మేసిన బూడిద(ఫైల్)

1.14 కోట్ల మెట్రిక్ టన్నుల బూడిద..

కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని 5,6,7 దశల కర్మాగారాల నుంచి వెలువడిన బూడిద నిల్వకు 1,146 ఎకరాల విస్తీర్ణంలో బూడిద చెరువులు ఏర్పాటు చేశారు. ఇవి సూరారం, పునుకుల, కరకవాగు గ్రామాల మధ్య ఉన్నాయి. కర్మాగారాల్లో విద్యుదుత్పత్తికి నిత్యం 25 వేల మెట్రిక్ టన్నుల బొగ్గును మండిస్తుండగా, రోజూ 12 నుంచి 13 వేల మెట్రిక్ టన్నుల బూడిద వెలువడుతోంది. బొగ్గు నాణ్యత లేకపోతే ఇంకా ఎక్కువస్థాయిలోనే వస్తోంది. దీంతో ఐదు, ఆరు దశల కర్మాగారాల యాష్ పాండ్‌లో 14 వేల మెట్రిక్ టన్నులు, 7వ దశ యాష్‌పాండ్‌లో కోటి మెట్రిక్ టన్నులపైగా బూడిద నిల్వలు పేరుకుపోయాయి.

బూడిద లేవకుండా చర్యలు..



కేటీపీఎస్ కర్మాగారంలో సెడిమెంటేషన్ ట్యాంక్ ఏర్పాటు చేశాం. దీంతో బూడిద కాలుష్యం గణనీయంగా తగ్గింది. అప్పర్, లోయర్ డ్రెయినేజీల ద్వారా వ్యర్థాలను వేరుచేసి పంపుతున్నాం. బూడిద చెరువులో ప్రస్తుతం 14 వేల మెట్రిక్ టన్నుల బూడిద నిల్వ ఉంది. గాలివీచినప్పుడు బూడిద కాలుష్యం గాలిలోకి లేవకుండా చర్యలు తీసుకుంటున్నాం. ట్యాంకర్ల ద్వారా నీటితో తడుపుతున్నాం. కిన్నెరసానిలో బూడిద కలవకుండా చూస్తున్నాం.
–ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5,6 దశల చీఫ్ ఇంజనీర్

విచారణ చేపడతాం

కేటీపీఎస్‌లో జెన్‌కో యాజమాన్యం కాలుష్య నివారణ నియంత్రణ నిబంధనలు పాటించడంలేదని వేసిన పిల్‌కు సంబంధించి మూడువారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు మరోసారి కేటీపీఎస్ కర్మాగారంలో విచారణ జరిపి నివేదిక అందజేస్తాం.
–రవీందర్, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్

స్థానికులకు అనారోగ్యం



యాష్‌పాండ్‌లో బూడిద లేచి గ్రామాలను కమ్మేస్తోంది. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. బూడిదను కిన్నెరసాని వాగులోకి కూడా పంపడంతో జలకాలుష్యం ఏర్పడుతోంది. జెన్ కో యాజమాన్యం కాలుష్య నియంత్రణ పాటించకపోవడంతో 2017 హైకోర్టులో పిల్ వేశాం.
–దాసరి రమేష్, పాండురంగాపురం

ఆదిలోనే వి'పత్తి'!



తొలిసారి వేసిన పత్తిగింజలు మొలవకపోవటంతో రెండోసారి గింజలు వేస్తున్న కూలీలు

- దోబూచులాడుతున్న నైరుతి రుతుపవనాలు
- పదును చాలక మొలకెత్తని పత్తి విత్తనాలు
- మళ్లీ విత్తనాలు వేయాల్సి రావడంతో అదనపు భారం
- ఇప్పటికే సుమారు 45 వేల ఎకరాల్లో పత్తి సాగు

బూర్గంపాడు: నైరుతి రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి. ఒకరోజు వాన కురిస్తే పదిరోజులు ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో వర్షాలు వస్తాయో, రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి ముందుగానే వస్తాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా రోహిణికార్తెలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి వాతావరణం చల్లబడింది. వర్షాలు కూడా కురవటంతో రైతులు సాగు పనులు ప్రారంభించారు. దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు భూములు సిద్ధం చేశారు. ఈ నెల మొదటివారంలో ఒకట్రెండు వర్షాలు పడటంతో రైతులు మెట్టభూములలో పత్తిగింజలు వేసుకున్నారు. రెండు, మూడు వారాల్లో వరుణుడు ముఖం చాటేశాడు. ఒకరోజు ఓ మాదిరి జల్లు కురిస్తే వారం, పదిరోజులు ఎండలు మండిపోతున్నాయి. విత్తిన పత్తి గింజలు పదును అందక సరిగా మొలకలు రావటం లేదు. కొన్నిచోట్ల మొలిచినా ఎండల తీవ్రతకు మొక్కలు వడలిపోతున్నాయి. చాలీచాలని పదునులో పడిన పత్తిగింజలు కొంత మేరా మొలకలు వచ్చి ఎండిపోతున్నాయి. దీంతో రైతులు మళ్లీ పత్తిగింజలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



రెండోసారి పత్తిగింజలు వేసేందుకు అచ్చు తోలుతున్న రైతు

సుమారు 1.80 లక్షల ఎకరాల్లో పత్తి సాగు..

ఈ ఏడాది జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం, గుండాల, ఆళ్లపల్లి, పాల్వంచ, ములకలపల్లి, సుజాతనగర్, టేకులపల్లి మండలాల్లో ఈ నెలలోనే సుమారు 45 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. తొలకరి వర్షాలు ఒకట్రెండు కురియటంతో రైతులు భూములు దున్ని గింజలు పెట్టుకున్నారు. ఈ నెల 10వ తేదీ తర్వాత జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురవలేదు. కొన్ని మండలాల్లో చిన్నపాటి జల్లులే తప్ప వానలు కురవటం లేదు. ఆ జల్లులకు పత్తి గింజలు మెత్తబడి మొలకలు తిరుగుతున్నాయి. అయితే సరైనా పదును అందకపోవటంతో ఆ మొలకలు పాదులలోనే అవిసిపోతున్నాయి. కొన్ని మండలాల్లో రైతులు వేసుకున్న పత్తి మొలవకపోవటంతో వాటిని చెడగొట్టి మళ్లీ గింజలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కొన్ని మండలాల్లో ఎక్కువగా, కొన్ని మండలాలో సాధారణంగా, మరికొన్ని మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రోజు మబ్బులు పడుతుండటంతో రైతులు అదును దాటుతోందని పత్తి విత్తనాలు వేసుకుంటున్నారు. చినుకు పడకపోవటంతో పంటల సాగుకు ఇబ్బందికరంగా మారింది. వాతావరణశాఖ కూడా రుతుపవనాలు వస్తున్నాయని, వర్షాలు కురుస్తాయని చెబుతోంది. కానీ అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. భూములు పదునైన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయశాఖ రైతులకు సూచించింది. అయితే రైతులు మాత్రం అదును దాటుతోందని, వర్షాలు కురవకపోతాయా అని కొంత ముందుగానే విత్తనాలు వేసుకుని ఇబ్బందులు పడుతున్నారు.

కొన్ని రకాల విత్తనాలకు డిమాండ్

ఈ ఏడాది జిల్లాలో కొన్ని రకాల పత్తి విత్తనాలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. రైతులు ఆ విత్తనాల కోసం నానా ఇబ్బందులు పడ్డారు. ఎక్కువ ధరలకు ఆ విత్తనాలను కొనుగోలు చేశారు. విత్తనాలు వేసి పదిరోజులు దాటుతున్న మొలకలు రాకపోవటంతో ఆందోళనకు గురవుతున్నారు. మళ్లీ విత్తనాలు కొనాలంటే అదనపు భారం పడుతుంది. రైతులు తమకు కావాల్సిన విత్తనాలు దొరికే పరిస్థితులు లేవని చెబుతున్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉండగా, ఒక్కో ప్యాకెట్ ధర రూ. 864 పలుకుతోంది. ఎకరాకు విత్తనాల కొనుగోలుకు రూ.1800, వేసేందుకు కూలీలకు రూ.600 ఖర్చవుతుంది. దుక్కులు చేసేందుకు, అచ్చు తోలేందుకు ఎకరాకు రూ. 5వేల వరకు ఖర్చువస్తుంది. తొలి విడత వేసిన గింజలు మొలవకపోతే రైతుకు ఎకరాకు కనీసం రూ. 4వేల వరకు అదనపు ఖర్చు పెరుగుతుంది.

విత్తనాలు సరిగా మొలవలేదు



పత్తి గింజలు వేసి పదిరోజులైనా సరిగా మొలవలేదు. 30 శాతం మాత్రమే మొలకలు వచ్చాయి. మిగతావి పదును సరిపోక మొలకలు రాలేదు. ఒకరోజు వాన పడితే పదిరోజులు ఎండలు దంచికొడుతున్నాయి. విత్తనాలు మళ్లీ వేయాలంటే ఎకరాకు రూ. 5వేల వరకు ఖర్చు పెరుగుతుంది.
–దారం రాజశేఖర్, రైతు, సంజీవరెడ్డిపాలెం

అదును దాటుతోంది



ఈ నెలలలో ఇప్పటివరకు సరైన వర్షాలు పడలేదు. పత్తి సాగుకు అదును దాటిపోతోంది. వేసిన పత్తిగింజలు మొలవలేదు. మళ్లీ పత్తిగింజలు వేయాలంటే పెట్టుబడులు పెరుగుతాయి. విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది ఆదిలోనే ఇబ్బంది ఏర్పడింది.
–పాలెం లక్ష్మిరెడ్డి, రైతు, నాగినేనిప్రోలు

క్లుప్తంగా

దివ్యాంగులతో సమావేశం ఏర్పాటు చేస్తాం..


కలెక్టర్‌కు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): దివ్యాంగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను కలిశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీశ్ విద్యార్థులకు అసరమైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాటి నాగేశ్వర రావు, శైలజ, కళాబాబురెడ్డి, రమేశ్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

స్తంభం ఎక్కే పరీక్షలో జేఎల్‌ఎం అభ్యర్థుల విఫలం

ఖమ్మంవ్యవసాయం: జూనియర్ లైన్‌మెన్ల ఎంపికకు శనివారం ఖమ్మంలోని సర్కిల్ కార్యాలయంలో స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా జేఎల్ఎంల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటి వరకు ఏడు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యర్థులకు స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించగా వారిద్దరూ విఫలమయ్యారు. దీంతో జాబితాలో వీరి తర్వాత ఉన్న మరో ఇద్దరికి త్వరలో పరీక్ష నిర్వహించే అవకాశముంది. పరీక్షలను ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్, అధికారులు పర్యవేక్షించారు.

సింగరేణి పరిరక్షణకు 26 నుంచి ఆందోళనలు

కొత్తగూడెంఅర్బన్ (సింగరేణి): తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తుండడాన్ని నిరసిస్తూ ఈనెల 26వ తేదీ నుంచి సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు, ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు ఎండీ రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న కొత్తగూడెం ఏరియాలోని పీవీకే–5 ఇంక్లైన్ వద్ద, 27న కేటీకే–5 గని వద్ద, 29న శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–7 గనిలో, జూలై 1న గోదావరిఖనిలోని జీడీకే–11 వద్ద ఆందోళనలు నిర్వహించడంతో పాటు జూలై 3న హైదరాబాద్‌లో హెచ్ఎంఎస్, ఇఫ్టూ–1, ఇఫ్టూ–(ఎస్‌వీ), ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, టీఎస్‌యూఎస్ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.


మణుగూరుకు అదనంగా ఈపీ ఆపరేటర్లు

కొత్తగూడెం అర్బన్(సింగరేణి): సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఓవర్ బర్డెన్ తొలగింపు కోసం అన్ని ఏరియాల నుంచి ఈపీ ఆపరేటర్లను డిప్యూటేషన్‌పై కేటాయించనున్నారు. ఆరు నెలల డిప్యూటేషన్ కోసం ఒక్కో ఏరియా నుంచి ఐదుగురు చొప్పున.. పది ఏరియాల నుంచి 50 మంది ఆపరేటర్లను కేటాయించాలని జీఎం(పర్సనల్) బీ.ఆర్.దీక్షితులు ఏరియాల అధికారులను శనివారం ఆదేశించారు. సీనియర్ ఆపరేటర్లు సుముఖత చూపని నేపథ్యాన జూనియర్ ఆపరేటర్లకు అవకాశం కల్పించాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి నెహ్రూబస్తీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు డ్యూటీ సమయంలో పాఠశాలలో లేకపోవడంతో శనివారం ఆ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈఓ వెంకటేశ్వరచారి తెలిపారు. డ్యూటీ సమయంలో ఆ ఉపాధ్యాయుడు పాఠశాలలో లేకపోవడంతో విద్యార్థులు కూడా ఇళ్లకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న డీఈఓ సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్


డివైడర్‌ను ఢీకొట్టడంతో కూలిన విద్యుత్ స్తంభం

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయిన ఓ డీసీఎం వ్యాన్ డివైడర్ మీదకు దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పాల్వంచలోని బీసీఎంరోడ్ రెజీనా కాన్వెంట్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయిన డీసీఎం వ్యాన్ డివైడర్‌పైకి దూసుకెళ్లి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం కూలడమే గాక మొక్కలు విరిగిపోయాయి. సమాచారం అందుకున్న మున్సిపల్ ఏఈ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

పోలీసుశాఖలో పనిచేస్తూ విశిష్ట సేవలను అందిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం కఠినసేవా పతకాలు, శౌర్య పతకాలు, సేవా పతకాలను శనివారం ప్రకటించింది. జిల్లా ఉద్యోగుల్లో శౌర్య పతకాలు 8 మందికి, ఉత్తమ సేవా పతకాలు ఇద్దరికి, కఠిన సేవా పతకాలు 45 మందికి, సేవా పతకాలు 11 మందికి దక్కాయి. – కొత్తగూడెంటౌన్

■ శౌర్య పతకాలు

బి.అశోక్, సీఐ, దుమ్ముగూడెం
యు.వెంకటయ్య ఏఆర్ ఎస్ఐ, ఓఎస్‌డీ ఆఫీస్
పెండం శ్రీనివాస్, సీఐ, ఎస్ఐబీ
జి.అశోక్, సీఐ, పీసీ
జి.సాయిలు (టీఎస్ఎస్‌పీ) గ్రేహౌండ్స్
పి.సంపత్‌కుమార్, జూనియర్ కమాండో, గ్రేహౌండ్స్
ఎన్.సతీశ్, జూనియర్ కమాండో, గ్రేహౌండ్స్
కె.శ్రీనివాసులు, ఆర్ఎస్ఐ

■ ఉత్తమ సేవా పతకాలు

సురిశెట్టి శ్రీనివాసరావు, ఎస్ఐ
ఎండీ ముజామిల్, హెచ్‌సీ బూర్గంపాడు

■ కఠిన సేవా పతకాలు

ఓంప్రకాష్, ఆర్ఎస్ఐ
సీహెచ్ రామకృష్ణ, ఆర్ఎస్ఐ
బానోతు రాములు, పీసీ గుండాల
బి.ఉపేందర్, పీసీ చర్ల
బోడ నరేశ్‌నాయక్, పీసీ దుమ్ముగూడెం
కె.రవీంద్ర, పీసీ చర్ల
టి.రవి, పీసీ ములకలపల్లి
ఎస్.హరీశ్, ఏఆర్‌పీసీ
జి.వెంకన్న, పీసీ అశ్వాపురం
ఎం.కోటేశ్వరరావు, చర్ల
ఎం.గణపతి, ఏఆర్‌పీసీ
వినోద్‌కుమార్, ఏఆర్‌పీసీ
ఐ.వీరబాబు, ఏఆర్‌పీసీ
జి.ఉపేందర్, ఏఆర్‌పీసీ
ఐ.అశోక్, ఏఆర్‌పీసీ
టి.మధు, ఏఆర్‌పీసీ
డి.గోపాల్‌రావు, ఏఆర్‌పీసీ
ఎస్.శ్రీను, ఏఆర్‌పీసీ
ఎ.వెంకన్న, ఏఆర్‌పీసీ కొమరారం
బి.వినోద్, పీసీ ఈ–బయ్యారం
పి.నాగేశ్వరరావు, పీసీ ఇల్లెందు
ఎండీ మహమూద్‌పాషా, పీసీ చర్ల
పి.ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ఐ
జి.సంతోష్‌కుమార్, ఆర్ఎస్ఐ
ఎస్.నవీన్‌కుమార్, హెచ్‌సీ
జి.సురేశ్, సీఐ హెచ్‌సీ
డి.శ్రీనివాస్, సీఐ హెచ్‌సీ
పి.రవీందర్, సీఐ హెచ్‌సీ
బి.విజయ్, సీఐ హెచ్‌సీ
ఎ.సంతోష్‌కుమార్, సీఐ హెచ్‌సీ
పి.మహేశ్, సీఐ హెచ్‌సీ
పి.పులేందర్, సీఐ హెచ్‌సీ
టి.సతీశ్, సీఐ హెచ్‌సీ
ఎ.సాయికుమార్, సీఐ ఎస్ఐబీ
ఎస్.శశికుమార్, సీఐ ఎస్ఐబీ
ఎస్.హరికృష్ణ, ఆర్ఎస్ఐ
సీహెచ్ నాగరాజు హెచ్‌సీ
ఎం.శ్రీనివాస్, హెచ్‌సీ
ఎం.సాయికుమార్, హెచ్‌సీ
గుండయ్య, ఎస్‌సీ (హెచ్‌సీ ఏఆర్) గ్రేహౌండ్స్
ఎం.బడా, ఎస్‌సీ (హెచ్‌సీ ఏఆర్) గ్రేహౌండ్స్
పి.హరికృష్ణ, జేసీ (పీసీ) గ్రేహౌండ్స్
వి.మధు, జేసీ (పీసీ) గ్రేహౌండ్స్
బి.నాగరాజు, జేసీ (పీసీ) గ్రేహౌండ్స్
డి.సుధాకర్, జేసీ (పీసీ) గ్రేహౌండ్స్
పి.ధర్మారెడ్డి, ఆక్టోపస్ డిపార్ట్‌మెంట్

■ సేవా పతకాలు

డి.సత్యనారాయణ, ఏఎస్ఐ, దుమ్ముగూడెం
షేక్ నిజాం అలీ ఏఎస్ఐ, మణుగూరు
టి.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ లక్ష్మీదేవిపల్లి
జి.హేమచందర్‌రావు, హెచ్‌సీ
కృష్ణానాయక్, హెచ్‌సీ
ఎస్‌కే సైదులు, హెచ్‌సీ
వైవీవీ ప్రసాద్, హెచ్‌సీ
వి.నారాయణరాజు, ఏఆర్ ఎస్ఐ
పి.శ్రీనివాసరావు ఏఎస్ఐ
ఈ.లక్ష్మణ్‌రావు, హెచ్‌సీ
వి.రామ్మూర్తి, హెచ్‌సీ

అప్రమత్తంగా ఉండాలి..

జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్ రావు

చుంచుపల్లి: గోదావరి వరద ముంపు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలని, అందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు ప్రభావిత గ్రామాలను గుర్తించి, అక్కడ ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకుని ముంపు ప్రాంత ప్రజలను సురక్షితంగా తరలించేందుకు సన్నద్ధం కావాలని చెప్పారు. వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, నాటు పడవలు, బోట్లు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వరదలు వచ్చినపుడు కరెంటు, తాగునీటి సమస్యలు రాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లను జిల్లా కేంద్ర కార్యాలయానికి అనుసంధానం చేసుకొని 24 గంటలు వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి 2020–21 నుంచి 2023–24 వరకు మంజూరైన నిధులపై ఆడిట్ అభ్యంతరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్, పలువురు ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఆరుద్ర పురుగు..



పంట పొలాల్లో ఆరుద్ర పురుగులు కనపడితే సమృద్ధిగా వర్షాలు పడి పంటలు పండుతాయని రైతులు విశ్వసిస్తారు. శనివారం అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో తూము సత్యనారాయణ పొలంలో ఆరుద్ర పురుగు కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. –అశ్వాపురం

28 నుంచి సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలను ఈ నెల 28 నుంచి 30 వరకు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఈ నెల 28న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం, 29, 30వ తేదీల్లో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. సమావేశాలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరవుతారన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు.

శుభకార్యానికి వచ్చి మృత్యువాత..

గోదావరిలో మునిగి ఒకరు మృతి


కార్తీక్ (ఫైల్)


ఒడ్డుకు తీసుకొచ్చిన కార్తీక్ వద్ద మేనమామ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సరిహద్దున ఉన్న శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఆదివారం తమ బంధువుల పెళ్లి వేడుకకు హాజరై సరదాగా గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లిన బాలుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఆదివారం జరగనున్న ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు కత్తి ఏడుకొండలు కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వచ్చారు. గోదావరిలో స్నానం చేసేందుకు ఏడుకొండలు, ఆయన మేనల్లుడు అంగలూరి కార్తీక్.. ఖమ్మం జిల్లా రావణగుట్ట వికలాంగుల కాలనీకి చెందిన బొజ్జ మల్లికార్జున్, బొజ్జ రాజుతో పాటు మరికొందరు వెళ్లారు. ఈ క్రమంలో కార్తీక్, మల్లికార్జున్, రాజు గోదావరిలో కొట్టుకుపోతుండగా ఏడుకొండలు గమనించి కేకలు వేశాడు. అక్కడే ఉన్న ఫొటోగ్రాఫర్లు, జాలర్లు మల్లికార్జున్, రాజును వెంటనే ఒడ్డుకు చేర్చారు. కార్తీక్‌ను జాలర్లు గుర్తించి ఒడ్డుకు తీసుకొచ్చి, మల్లికార్జున్, రాజుతో పాటు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ అప్పటికే మృతి చెందాడని, రాజు ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, మెరుగైన వైద్యం కోసం మల్లికార్జున్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అంగులూరి కార్తీక్ తల్లిదండ్రులు చనిపోగా మేనమామ వద్దనే ఉంటూ చదువుతున్నాడు. ప్రస్తుతం కార్తీక్‌కూడా మృతిచెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. కార్తీక్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోరంపల్లిబంజరకు చెందిన బర్ల హేమంత్ (22) తల్లి శాంతమ్మ వారపుసంతకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చే సరికి హేమంత్ ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారమివ్వటంతో వారు ఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఏడాది కిందట హేమంత్ తండ్రి ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి హేమంత్ తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుని సోదరుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత...

కొత్తగూడెంరూరల్: వరకట్నం వేధింపులు తాళలేక పురుగులమందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా నడిగూడెం బృందావనపురం గ్రామానికి చెందిన బాలబోయిన మానస (20)కు లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గ్రామానికి చెందిన సంతోష్‌తో వివాహం జరిగింది. వారికి బాబు ఉన్నాడు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడు. తట్టుకోలేక శుక్రవారం మానస పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణారెడ్డి శనివారం తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు


శోభన్‌బాబు(ఫైల్)

కరకగూడెం: పురుగుల మందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా శనివారం కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మొగలితోగు గ్రామానికి చెందిన అరెం శోభన్‌బాబు (36) కుటుంబ కలహాలతో మద్యం మత్తులో పురుగులమందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి మొదటి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో పేకాట ఆడుతున్నవారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మండలంలోని ఎర్రగుంట గ్రామంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.7,300 నగదు, ఒక మోటర్ సైకిల్, నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

కాపుసారా తయారీ అనుమానితుల బైండోవర్



అనుమానితులను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచిన ఎక్సైజ్ అధికారులు

చంద్రుగొండ: కాపుసారా తయారు చేస్తున్నారని అనుమానిస్తూ ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట ఎక్సైజ్ అధికారులు శనివారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ రమేశ్ కథనం ప్రకారం.. మండలంలోని సుంకరబంజర్, టేకులబంజర్ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు కాపుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ క్రమంలో వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శ్రావణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు రూ.2.20 కోట్ల మేర టోకరా

ఎర్రుపాలెం: ములుగుమాడుకు చెందిన మిర్చి వ్యాపారి ఖరీదు కృష్ణారావు రూ.2.20కోట్ల మేర రైతులకు టోకరా పెట్టాడు. బాధిత రైతులు రామకృష్ణ, శేఖర్, బాలకృష్ణ తదితరులు శనివారం ఎర్రుపాలెం పోలీసులతో పాటు మధిర సీఐ మధుకు ఫిర్యాదు చేశారు. వ్యాపారి కృష్ణారావు నాలుగేళ్లుగా గ్రామంలో రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేస్తూ సక్రమంగానే నగదు చెల్లించాడు. ఈ ఏడాది కూడా దాదాపు 70మంది రైతులు రూ.2.20కోట్ల విలువైన వెయ్యి క్వింటాళ్ల మిర్చిని ఆయనకు విక్రయించారు. ఈనెల 18న ఇంటికి తాళం వేసి వెళ్లాడు. వ్యాపారి మోసం చేసినట్లు గర్తించిన రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ ఇంజన్‌కు తగిలి వృద్ధురాలు మృతి


ముత్యం (ఫైల్)

చంద్రుగొండ: ట్రాక్టర్ ఇంజన్‌కు తగిలి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని తుంగారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తుంగారం గ్రామానికి చెందిన అప్పికుంట్ల ముత్యం (65) రెండో వీధిలో ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్‌కు తగిలి రోడ్డుపై పడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రవి తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి..

బూర్గంపాడు: మండలంలోని మర్రికుంట గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మర్రికుంటకు చెందిన బొర్రా రాములు (45) లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో భద్రాచలం నుంచి పాల్వంచ వైపునకు వెళ్తున్న మోటార్ సైకిల్ వేగంగా ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన ఆయన్ను గ్రామస్తులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాములు మృతి చెందాడు. మృతుడి సోదరుడు మునయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌క్రైం కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మెడికల్‌కాలనీకి చెందిన ఓ మహిళ సైబర్‌మోసానికి గురైంది. సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. మెడికల్‌కాలనీకి చెందిన గోగి పద్మ.. బంధువు ప్రశాంతికి ఓ ఆస్పత్రిలో కాన్పు అయింది. ఓ అపరిచిత వ్యక్తి ప్రశాంతికి ఫోన్ చేసి.. వైద్యశాఖ నుంచి మాట్లాడుతున్నామని, కాన్పునకు సంబంధించి నగదు పంపిస్తామని, ఫోన్‌పే నంబర్ చెప్పాలని సూచించాడు. అయితే, ప్రశాంతి.. తనకు ఫోన్‌పే లేదని, తన బంధువైన పద్మ నంబర్ ఇచ్చింది. దుండగుడు ఆమెకు ఫోన్ చేసి, లింక్ పంపించి తన ఖాతాలో ఉన్న రూ.56 వేలను అపహరించాడు. మోసాన్ని గమనించిన పద్మ వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి కేసు రిజిస్టర్ చేసింది. నగదు సైబర్ మోసగాడి ఖాతాలోకి వెళ్లకుండా హోల్డ్ చేయించామని, పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని యూబీ రోడ్డులో శనివారం మధ్యాహ్నం నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్న రాందేవ్‌ను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి రూ.10 వేలు విలువ గల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి వెల్లడించారు. అనంతరం రాందేవ్‌పై కేసు నమోదు చేశామని ఆమె వివరించారు.

గిరిజనాభివృద్ధికి నా వంతుగా కృషి చేశా

బదిలీ పీఓ ప్రతీక్‌జైన్


ప్రతీక్‌జైన్ దంపతులను సత్కరిస్తున్న ఐటీడీఏ అధికారులు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల అభివృద్ధికి పీఓగా తన వంతు కృషి చేశానని వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లిన ప్రతీక్‌జైన్ వెల్లడించారు. ఇటీవల పదోన్నతిపై కలెక్టర్‌గా వెళ్లిన ఆయనను ఐటీడీఏ అధికారులు శుక్రవారం రాత్రి సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ జితేశ్ వి.పాటిల్ మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులకు బదిలీలు సాధారణమేనని తెలిపారు. అయితే, విధుల్లో ఉన్నప్పుడు చేసిన పనులు ఎల్లకాలం గుర్తుంటాయని చెప్పారు. అనంతరం ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. పీఓగా 11 నెలలే పనిచేసినా గిరిజనులతో మమైకమై వారి అభివృద్ధికి పాటుపడిన అనుభవాన్ని మర్చిపోలేనని పేర్కొన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞలు తెలిపారు. ఆ తర్వాత ప్రతీక్‌జైన్ దంపతులను ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గురుకులాల ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు భీమ్, సురేశ్‌బాబు, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, తానాజీ, మునీర్‌పాషా, అశోక్, నరేశ్, అలివేలు మంగతాయారు, ఆదినారాయణ, నర్సింహారావు, రూపాదేవి, చంద్రమోహన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు మత్స్య సొసైటీలకు ఎన్నికలు..

ఓటర్ల జాబితా సవరణకు నోటిఫికేషన్ జారీ

పాల్వంచరూరల్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికలకు మత్స్యశాఖ అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో 2022న ఎన్నికలు జరగ్గా, ఆ సమయంలో అన్నపురెడ్డిపల్లి, అశ్వాపురం, పినపాక, ఇల్లెందు మండలాల పరిధిలోని ఐదు సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఈ ఐదు సొసైటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు మత్స్యశాఖ అధికారి ఇటీవల ఓటర్ల జాబితా సవరణ కోసం నోటిఫికేషన్ జారీచేశారు. సవరణ గడువు ఈ నెల 24 వరకు నిర్దేశించారు. కాగా జిల్లాలో 63 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, వాటిలో 3,215 మంది సభ్యులు ఉన్నారు. సహకార సంఘాలకు ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తారు.

ప్రతిపాదనలు పంపాం



జిల్లాలో ఐదు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపాం. ఎన్నికల కమిషన్ తేదీ గడువును నిర్దేశించాక ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. సంఘాల్లో సభ్యులు చేతులు పైకి ఎత్తడం ద్వారా లేదా రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకుంటారు.

–వీరన్న, జిల్లామత్స్యశాఖాధికారి

ఉప్పొంగిన వాగులు

గుండాలలో భారీ వర్షం


లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో కిన్నెరసాని, మల్లన్న వాగు, తోట్టి వాగు, ఏడు మెళికల వాగు, జల్లేరు తదితర వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. గుండాల–కొడవటంచ గ్రామాల మధ్య కిన్నెసాని లోలెవల్ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహించాయి. దీంతో నాగారం, పాలగూడెం, కొడవటంచ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఈ ఖరీఫ్‌లో ఇదే తొలివాన కావడంతో ఇప్పటికే దుక్కులు చేసుకున్న రైతులు విత్తనాలు నాటడంలో నిమగ్నమయ్యారు.

గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని భద్రాచలం పట్టణ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రవాణా శాఖ చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారులను ఆపి తనిఖీ చేయగా 20 కిలోల ఎండు గంజాయి లభించింది. అందులోని ఇద్దరు వ్యక్తులకు అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు గంజాయిని రవాణా చేస్తున్నట్లు తేలిందని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రెండు ఫోన్లు, కారు, గంజాయిని సీజ్ చేశామని ఆమె వివరించారు. గంజాయి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని వెల్లడించారు. తనిఖీల్లో ఎస్ఐలు అల్లూరి సీతారామరాజు, సాయిరాం, సిబ్బంది అలీమ్, వీరబాబు, బాబు, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ములకలపల్లి: మద్యం సేవించి విధులకు హాజరైన రాజీవ్‌నగర్‌కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పత్తిపాటి వీరయ్యపై సస్పెన్షన్ వేటుపడింది. వీరయ్య శుక్రవారం అతిగా మద్యం సేవించి తూలుతున్న స్థితితో పాఠశాలకు రాగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు సమీపంలో పశువులపాకలో పడకోబెట్టిన విషయం విదితమే. ఈ ఘటనపై పత్రికల్లో కథనాలు వెలువడటం, సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. డీఈఓ వెంకటేశ్వరచారి వీరయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.